సీబీఐటీ ప్రొఫెసర్‌కు ప్రశంసపత్రం



ప్రిన్సిపాల్ నుంచి ప్రశంసపత్రం అందుకుంటున్న జీఎస్ఆర్ ప్రసాద్

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) ప్రొఫెసర్‌కు అంతర్జాతీయ స్థాయిలో మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్, ఇన్నోవేషన్స్ పేపర్ ప్రజెంటేషన్ పోటీల్లో ఉత్తమ ప్రశంస దక్కింది. గత నెల 31న సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో సీబీఐటీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ ప్రసాద్ 'కంప్యూటర్ పర్చేజ్ ప్రిడిక్షన్ త్రూ నైవే బయేస్ క్లాసిఫియర్' అనే అంశంపై పేపర్ ప్రజెంటేషన్ సమర్పించారు. అతని పేపర్ ఉత్తమంగా నిలవడంతో గురువారం కళాశాలకు ప్రశంస పత్రం పంపించారు. దానిని ప్రిన్సిపాల్ సీవీ నర్సింహులు ప్రసాద్‌కు అందించి ప్రశంసించారు. తోటి అధ్యాపకులు కూడా అభినందించారు.

విద్యాసంస్థల వాహనాల తనిఖీ

రాజేంద్రనగర్: రంగారెడ్డి జిల్లా రవాణా శాఖ అధికారులు రాజేంద్రనగర్ సర్కిల్ శివరాంపల్లి వద్ద గురువారం విద్యాసంస్థల బస్సుల తనిఖీలు చేపట్టారు. ఫిట్‌నెస్, బీమా, లైసెన్స్ లేని ఎనిమిది బస్సులను గుర్తించి కేసు నమోదు చేసి వాటిని సీజ్ చేశారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ.. నిబంధనల మేరకు వాహనాలు నడపాలని లేకుంటే సీజ్ చేస్తామని హెచ్చరించారు. బుధవారం 17 బస్సులు, గురువారం 8 బస్సులు మొత్తం 25 వాహనాలు సీజ్ చేశామని పేర్కొన్నారు.



బస్సును తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

అక్రమ నిర్మాణాల కూల్చివేత



మణికొండ: జీవో 111 పరిధిలోని అక్రమ నిర్మాణాలను కలెక్టర్ శశాంక ఆదేశాలతో అధికారులు గురువారం కూల్చివేశారు. వట్టినాగులపల్లి రెవెన్యూ పరిధిలోని శంకరహిల్స్ లేఅవుట్‌లో ఓ షెడ్, తులసీ లేఅవుట్‌లోని రెండు భవనాల స్లాబులను హెచ్ఎండీఏ, డీటీఎఫ్ ఎన్‌ఫోర్స్ బృందం తొలగించింది. అనుమతుల మేరకే నిర్మాణాలు చేపట్టాలని యజమానులకు సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో పాటు టీపీఓ మణిహారిక, ఆర్‌ఐ విక్రంరెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లెక్సీలతో పొంచి ఉన్న ప్రమాదం..!

రాజేంద్రనగర్: ఆరాంఘర్ నుంచి మెహిదీపట్నం వరకు గల పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వేపై రోడ్డు మధ్యలో పొలిటికల్ లీడర్లు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ప్రమాదకరంగా మారాయి. గాలి, దుమారం వీయడంతో రోడ్డు మధ్యలో స్తంభాలకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు రోడ్డుపై పడడం, వేలాడటంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు ఎక్స్‌ప్రెస్ వేపై ఏర్పాటు చేసిన, రోడ్డుపై పడిన ఫ్లెక్సీలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.



ఆరాంఘర్ నుంచి మెహిదీపట్నం వరకు గల పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వేపై ప్రమాదకరంగా ఫ్లెక్సీ

చెరువుల పరిరక్షణకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శశాంక్, జెడ్సీ స్నేహ

రాయదుర్గం: చెరువుల పరిరక్షణకు కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ అధికారులను ఆదేశించారు. గురువారం జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ జోనల్ కార్యాలయంలో చెరువు పరిరక్షణపై జీహెచ్ఎంసీ, నీటిపారుదల శాఖ అధికారుల సమన్వయ సమావేశాన్ని జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి జోన్ పరిధిలో చెరువు స్థలాల పరిరక్షణకు అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెరువుల పర్యవేక్షణకు నియమించిన అధికారులు విధిగా తమ పరిధిలోని చెరువులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయన సూచించారు. చెరువుల ఎఫ్‌టిఎల్ బఫర్‌జోన్లపై అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. చెరువుల చుట్టూ రక్షణ కంచెను విధిగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్లలో ఎలాంటి ఆక్రమణలను ఉపేక్షించవద్దని స్పష్టం చేశారు. చెరువుల పరిరక్షణ కమిటీలతో ఎప్పటికప్పుడు జోనల్ అధికారులు సమీక్ష నిర్వహించి క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకుంటూ ఉండాలన్నారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ నీటిపారుదల శాఖ అధికారులు, చెరువుల పరిరక్షణ కమిటీ అధికారులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులపై ఉక్కుపాదం మోపాలి

అబిడ్స్: కాశ్మీర్‌లో దాడిచేసిన ఉగ్రవాదులపై ఉక్కుపాదం మోపాలని భజరంగ్‌దళ్, వీహెచ్‌పీ నాయకులు కోరారు. ఈ మేరకు భజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు, భాగ్యనగర్ విభాగ విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి కమల్‌వీరేష్, విశేష సంపర్క్, తెలంగాణ ప్రాంత ప్రముఖ్ వెంకటేశ్వర్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన జమ్మూకాశ్మీర్ ప్రాంతంలో హిందూ భక్తులపై ఉగ్రవాదులు దాడిచేయడం దారుణమన్నారు. కాశ్మీర్ పరిసర ప్రాంతాల్లో పాకిస్తాన్‌కు చెందిన ఇస్లామిక్ హిందూ భక్తులపై దాడులు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రపతి ప్రత్యేక చర్యలు తీసుకుని ఇలాంటి దాడులు మరోసారి జరగకుండా కఠినంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ గోల్కొండ జిల్లా కార్యదర్శి చిల్కుల రామారావు, శశికాంత్ పాల్గొన్నారు.

ఈద్గాలను పరిశీలించిన ఎమ్మెల్యే

గోల్కొండ: బక్రీద్ పండుగ సందర్భంగా కార్వాన్ నియోజకవర్గంలోని ఈద్గాల వద్ద అవసరమైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి ఈద్గాలను పరిశీలించారు. మొదటగా గోల్కొండ సమీపంలోని చారిత్రక కుతుబ్‌షాహీ ఈద్గాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. బక్రీద్ పండుగ రోజున ప్రార్థనలకు వచ్చే వారికి అవసరమైన అన్ని పనులు పండుగ ఒక రోజు ముందుగానే పూర్తి చేయాలని ఆయన అన్నారు. అనంత రం ఆయన హకీంపేట్, లంగర్‌హౌజ్ తదితర ప్రాంతాలలోని ఈద్గాలను సైతం పరిశీలించారు. టోలిచౌకీ, గోల్కొండ, కార్వాన్, గుడిమల్కాపూర్, లంగర్‌హౌజ్ తదితర ప్రాంతాలలోని జామా మసీదుల వద్ద వెంటనే పారిశుధ్య పనులు చేప ట్టాలని ఆయన బల్దియా అధికారులను కోరారు.

అమ్మాయిల చదువు దేశానికే వెలుగు

చాంద్రాయణగుట్ట: అమ్మాయిల చదువు దేశానికే వెలుగుగా నిలుస్తుందని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్ అన్నారు. హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ సామాజిక వేత్తలు హిమజ, మల్లీశ్వరీ ఆధ్వర్యంలో చాంద్రాయణగుట్టలోని రెసిడెన్షియల్ బ్రిడ్జి కోర్సు బాలికల క్యాంప్ పాఠశాలలో 'బాలికలు-చదువు' అనే అంశంపై గురువారం అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన హిప్నో పద్మా కమలాకర్ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో అమ్మాయిలు ఆకర్షణకు లోనై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేధింపుల వల్లే ఏటా 24.6 కోట్ల మంది బాలికలు అర్థంతరంగా చదువును ముగిస్తున్నారన్నారు. అనంతరం బాలికలకు భగవద్గీత శతకాలు, పజిల్స్ పుస్తకాలు, శానిటరీ న్యాప్కిన్స్‌ను అందజేశారు.

ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేయాలి

చార్మినార్: రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేయాలని ఉర్దూ తెహ్రీఖ్ అధ్యక్షులు ఎజాజ్ అలీ ఖురేషీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉర్దూ తెహ్రీఖ్ అధ్యక్షుడు ఎజాజ్ అలీ ఖురేషీ ఆధ్వర్యంలోని ప్రతినిధుల బృందం ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హమ్‌దాన్‌కు గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు.



సాగుకు సిద్ధం చేసిన దుక్కి

పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

రైతులకు వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల సూచన

ఏఈవర్సిటీ: నైరుతి రుతుపవనాలు జూన్ 3న రాష్ట్రంలోకి ప్రవేశించి 12వ తేదీలోగా అన్ని ప్రాంత్రాలకు విస్తరించాయి. దీంతో భారత వాతావరణ విభాగం న్యూఢిల్లీ వారి సూచనల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో ఈ సీజన్లో సాధారణం కంటే ఎక్కువగా వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని, నేల రకం నీటి వసతి, పెట్టుబడి మొదలగు అంశాలను పరిగణలోనికి తీసుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సీనియర్ అధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

తెలంగాణలో ప్రధాన పంటలు..

రాష్ట్రంలో ప్రధానంగా వరి, పత్తి, కంది, మక్కజొన్న, సోయా చిక్కుడు ప్రధాన పంటలుగా పెద్ద మొత్తంలో సాగు చేస్తుంటారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం మార్కెటింగ్ ఇంటెలిజెన్స్ వారి ముందస్తు ధరల సూచనల ప్రకారం ఈ యేడు ప్రధాన పంటలకు ఎక్కువగా ధరలు పలికే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్రంలో పశువుల పేడ లభ్యత తక్కువగా ఉండడంతో వరి సాగు చేసే రైతులు జనుము, జీలుగాను సాగు చేస్తే నేల సారవంతంతో పాటు చీడ పీడలను తట్టుకునే శక్తి మొక్కకు వస్తుందని సూచిసున్నారు.

నారుమళ్లు..

ఎంపిక చేసుకున్న దీర్ఘకాలిక వరి రకాలను జూన్ 20 వరకు, మధ్య రకాలను జూలై 10 వరకు, స్వల్పకాలిక రకాలను జూలై చివరి వారం వరకు నారు పోసుకొని వరి నాటుకోవచ్చని తెలిపారు. తెలంగాణ సోనాను జూలై మొదటి వారం నుంచి మాత్రమే నారు పోసుకోవాలని సూచిస్తున్నారు.

పత్తిలో జాగ్రత్తలతోనే అధిక దిగుబడులు

రైతులు పత్తి విత్తనాలు విత్తే సమయంలో తగు సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. తేలిక నేలల్లో 50 నుండి 60 మిల్లీమీటర్ల వర్షపాతం, బరువైన నేలలు 60 నుంచి 75 మిల్లీ మీటరు వర్షపాతం నమోదైన తర్వాత మాత్రమే విత్తనం వేసుకుంటే ఎకరాకు రెండున్నర నుంచి మూడు క్వింటాళ్ల దిగుబడి పొందవచ్చని తెలిపారు.

కందిలో అంతర్ పంటలతో లాభాలు..

కంది పంట మొదటి 60 రోజుల్లో పెరుగుదల తక్కువగా ఉంటుందని దీంతో అంతర పంటలుగా పెసర, మక్కజొన్న, పత్తి మొదలగు పంటలను సాగు చేసుకోవచ్చన్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనా పంట నష్టం జరగకుండా దిగుబడులను సాధించవచ్చని తెలిపారు.

మక్కజొన్న

ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసిన అధిక దిగుబడి నిచ్చే మక్కజొన్న సంకర రకాలు (డీహెచ్ఎం 117), (డీహెచ్ఎం 121) ప్రైవేట్ హైబ్రిడ్లకు దీటుగా దిగుబడులు ఇవ్వడమే కాకుండా విత్తనాల ఖరీదు కూడా చాలా తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. కందిలో అంతర్ పంటగా మక్కజొన్నను సాగు చేసుకోవాలని సూచిస్తున్నారు.

సోయచిక్కుడు..

సోయా చిక్కుడు పంటను జూన్ 30 తేదీలోగా విత్తనం వేసుకోవాలి. జూలైలో నాటితే చాలావరకు దిగుబడులు తగ్గిపోతాయి. సోయా చిక్కుడులో ఎకరాకు 10 నుంచి 25 కిలోల విత్తనాలు మాత్రమే వేసుకోవాలి.

అధిక ఫీజులు వసూలు చేయొద్దు

మణికొండ: ప్రైవేట్ విద్యాసంస్థల వారు అధిక ఫీజులు వసూలు చేయొద్దని మణికొండ మున్సిపాలిటీ ది సిటిజన్ కౌన్సిల్ సంస్థ అధ్యక్షుడు డి.సీతారాం, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఆరీఫ్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భారత ప్రభుత్వం రాజ్యాంగ సవరణ ద్వారా 2010 సంవత్సరంలో 6-14 ఏళ్ల వరకు విద్యను ప్రాథమిక హక్కుగా ప్రకటించిందని గుర్తు చేశారు. ఇలాంటి అనేక మార్పులు వచ్చినా అందరికీ మెరుగైన విద్యావకాశాలు అందుబాటులో ఉండకపోవడం తగదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ మధ్యే స్కూల్ ఫీజు రెగ్యులేటరీ అథారిటీని నియమించిందని, ఫీజుల నియంత్రణ ఇప్పుడైనా జరుగుతుందని ఆశాభావంతో ఉన్నామని తెలిపారు.

15,16 తేదీల్లో నేచర్ క్యాంప్

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రెండురోజుల నేచర్ క్యాంప్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీ చేరువలోని చిలుకూరు ఫారెస్ట్‌ట్రెక్ పార్కులో ఈ క్యాంపు ఉంటుందని టీఎస్ఎఫ్‌డీసీ అధికారులు తెలిపారు. ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు పాల్గొనే వారు రిపోర్టు చేయాలని, ఈ కార్యక్రమాన్ని 16వ తేదీ ఉదయం 10 గంటలవరకు నిర్వహిస్తారు. కార్యక్రమంలో పాల్గొనేవారిలో 12 ఏళ్ళు పైబడిన వారు రూ.1800 చెల్లించాలని, 5 నుంచి 12 ఏళ్ళలోపు ఉన్నవారు రూ.1200 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్9493549399, 9346364583లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

నిధుల గందరగోళంపై నిగ్గు తేల్చాలి

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయంలో జరుగుతున్న నిధుల గందరగోళంపై విచారణ చేపట్టాలని మాజీ ఫోర్‌మెన్ కమిటీ చైర్మన్లు శివకుమార్, బద్రీనాథ్ గౌడ్, పోసాని సురేందర్ ముదిరాజ్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. 2021-22, 2023-24 సంవత్సరాల్లో అప్పటి చైర్మన్లు ఆదాయ వ్యయాలకు సంబంధించి వివరాలు వెల్లడించనందుకు ఇప్పటికే దేవాదాయ శాఖ నోటీసులు ఇచ్చిందన్నారు. దీంతోపాటు వీరి హయాంలో దేవాదాయ ఆదాయంతో ప్రైవేట్ వ్యక్తులపై ఆస్తులు కొనుగోలు చేశారంటూ మంత్రికి ఫిర్యాదు చేశారు. ప్రత్యేకాధికారి పర్యవేక్షణలోనే ఈ సారి బోనాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు సుధాకర్ ముదిరాజ్, సదానంద్ ముదిరాజ్, రంగ శ్రీకాంత్ గౌడ్ ఉన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

బక్రీద్ పండుగ ఏర్పాట్లపై జోనల్ కమిషనర్ సమీక్ష

చార్మినార్: బక్రీద్ పండగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగల అధికారులు సమన్వయంతో పని చేయాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న అధికారులను ఆదేశించారు. రానున్న బక్రీద్ పండగను పురస్కరించుకొని పూల్బాగ్ లోని జోనల్ కార్యాలయంలో గురువారం జోనల్ కమిషనర్ అన్ని విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల 17న జరుగనున్న బక్రీద్ పండుగ నేపథ్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించే ఈద్గాలు, మసీదుల వద్ద పారిశుద్ధ్య సమస్యలు, వీధి దీపాల సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కుర్బానీ చేసిన వ్యర్థాలను రోడ్లపై వేయకుండా ఇంటింటికీ గార్బేజ్ కవర్లను పంపిణీ చేస్తున్నామన్నారు. జంతువు వ్యర్థాలను ఆయా ప్రాంతాల ప్రజలు తాము అందజేసిన గార్బేజ్ కవర్లలో వేసి ఇంటి వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటో టిప్పర్ సిబ్బందికి అందజేయాలన్నారు. జంతు వ్యర్థాలను తొలగించేందుకు ప్రత్యేక బృందాలు, జేసీబీలు, అదనపు వాహనాలను ఏర్పాటు చేసి ఓపెన్ గార్బేజ్ పాయింట్ లలో చెత్త, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించనున్నామన్నారు. సమావేశంలో చార్మినార్ జోన్ జాయింట్ కమిషనర్ శైలజ, ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ (వెటర్నరీ) డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మలక్ పేట్, సంతోష్ నగర్, చాంద్రాయణగుట్ట, చార్మినార్, రాజేంద్రనగర్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు జయంత్, శివకుమార్, సురేందర్, సరిత, శ్రీనివాస్ రెడ్డి, రవికుమార్, డిప్యూటీ కమిషనర్ (ఎస్ డబ్ల్యూ ఎం) రాజేష్ కుమార్, ఈఈలు నరేందర్ గౌడ్, సనావుద్దీన్, పీర్ సింగ్, హరి కిషోర్, ప్రకాశం, ఏఎంహెచ్ఓలు, డీఈలు, ఎలక్ట్రికల్ విభాగం అధికారులు, ఆరోగ్యం పారిశుధ్యం విభాగం, అధికారులు, శానిటరీ సూపర్వైజర్ పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్



ఖుర్బానీకి సిద్ధంగా పొట్టేళ్లు

పాతబస్తీలో మొదలైన పండగ సందడి

చార్మినార్: పాతబస్తీలో బక్రీద్ సందడి మొదలైంది. ప్రధాన కూడళ్ల వద్ద సంబంధిత పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. నిబంధలన ప్రకారమే జంతువులను పాతబస్తీకి తరలించి బక్రీద్‌ను జరుపుకోవాలని సంబంధిత పోలీసు అధికారులు కోరుతున్నారు. ఈ నెల 17వ తేదీన ముస్లిం సోదరులు బక్రీదు పండుగను ఘనంగా జరుపుకోనున్నారు. ఆయా ప్రాంతాల ముస్లిం ప్రజలు తమకు కావాల్సిన గొర్రెలు, మేకలను ఖరీదు చేస్తున్నారు. త్యాగానికి మరో పేరుగా నిర్వహించుకునే ఈ బక్రీదు పండుగ కోసం గ్రేటర్ శివారు జిల్లాల నుంచి గొర్రెలు, మేకలు పాతబస్తీకి తరలి వచ్చాయి. పాతబస్తీ శివారు లోని ప్రధాన కూడళ్లలో గొర్రెలు, మేకలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. గతేడాది కన్నా ఈసారి పొట్టేళ్లు, మేకల రేట్లు అధికంగా ఉన్నాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. అయితే బరువుకు అనుగుణంగా వీటి రేట్లుంటాయి.

త్యాగానికి ప్రతిరూపం బక్రీద్

ముస్లింలకు ప్రధానంగా ఏడాదికి రెండే రెండు పండుగలు రంజాన్, బక్రీద్. అల్లాహ్‌పై భక్తికి రంజాన్ ప్రతిరూపమైతే త్యాగానికి ప్రతిరూపం బక్రీద్. ఆరాధించే అల్లాహ్ కోసం ప్రాణత్యాగానికి సైతం వెనుకాడని నాటి ప్రవక్త ఇబ్రహీం (అ), ఇస్మాయిల్ (అ)ల త్యాగనిరతిని ఈ బక్రీద్ పండుగ గుర్తు చేస్తుంది. బక్రీద్‌ను 'ఈద్-ఉల్-అజ్‌హా' అని కూడా అంటారు. ఇస్లామిక్ చరిత్రలో ఇబ్రహీంది ప్రముఖ స్థానం. అల్లాహ్ పెట్టిన పరీక్షలలో అన్నింటిలో నెగ్గిన ప్రవక్త ఇతను. ఓ సారి ఇబ్రహీంను తన పేర అతని ముద్దుల కుమారుడు ఇస్మాయిల్‌ని బలివ్వాలని ఆదేశిస్తాడు. అల్లాహ్ ఆదేశానుసారం మానవ బంధుత్వాలకతీతంగా ఇబ్రహీం తన కుమారుడు ఇస్మాయిల్‌ను బలి ఇవ్వడానికి సిద్ధమవుతాడు. తండ్రి మాట ప్రకారం అల్లాహ్ కోసం ప్రాణత్యాగానికి ఇస్మాయిల్ సిద్ధమవుతాడు. స్వయంగా తన కుమారుడిని బలివ్వడానికి సిద్ధమైన ఇబ్రహీం త్యాగాన్ని అల్లాహ్ మెచ్చుకొని కుమారుడి బదులు ఓ జీవాన్ని బలివ్వాలని కోరడం..ఆ రోజు నుంచి ఆనవాయితీగా బక్రీద్ రోజు ఖుర్బానీ ఇవ్వడం జరుగుతోంది. ఇస్లాం మూల స్తంభాలలో హజ్ కూడా ఇదే రోజు చేస్తారు. ఆర్థికంగా బాగున్న ప్రతి ముస్లిం ఖుర్బానీ ఇవ్వడం అతని విధి. పొట్టేళు, మేకలు, ఆవులు, దూడలతో పాటు ఒంటెలను ఖుర్బానీ ఇవ్వడం జరుగుతోంది.

మూడు భాగాలుగా ఖుర్బానీ మాంసం..

ఖుర్బానీ ఇచ్చే వారికి ముఖ్యంగా వడ్డీతో కూడిన అప్పు ఇవ్వరాదు..తీసుకోరాదు. చిన్నజీవాలను వ్యక్తిగతంగా, పెద్ద జీవాలను ఏడుగురు భాగస్వాములై ఉండాలి. అల్లాహ్ పేర బలిచ్చిన ఈ జంతువుల మాంసాన్ని మూడు సమాన భాగాలను చేయాలి. దీంట్లో ఒకభాగం ఖుర్బానీ ఇస్తున్న వారు తీసుకొని.. రెండో భా గాన్ని తమ బంధువులకు.. మూడో భాగా న్ని పేద ముస్లింలకు పంచాలి. బలిచ్చే జంతువులకు శరీర భాగాలలో ఎలాంటి లోపం ఉండరాదు.

ఖుర్బానీకి ప్రతిఫలం పుణ్యం..

బలివ్వడానికి జంతువును కోసే సమయంలో దాని రక్తపు చుక్క భూమిపై పడేకంటే ముందే ఆ జంతువు శరీరంపైనున్న వెంట్రుకల సమానంగా వారికి పుణ్యం లభిస్తుందని ఇస్లాం చెబుతోందని మత పెద్దలు అంటున్నారు. అందుకని ప్రతి ముస్లిం విధిగా ఖుర్బానీ ఇస్తారంటున్నారు. ప్రతి ముస్లిం తన జీవిత కాలంలో ఒక్కసారైన హజ్ చేయాలనుకుంటాడు. ఇది ముస్లింల ఫర్జ్. ఇస్లాం మూల స్తంభాలలో హజ్ ఒకటి. ఈ బక్రీద్ పండుగ రోజే హజ్ ఉంటుంది. ఈ సందర్భంగా హజ్ చేసే ముందు కూడా ప్రతి హాజీ విధిగా ఖుర్బానీ ఇవ్వాల్సిందే.

సమస్యల పరిష్కారానికి కృషి



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీలతాసురేశ్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని కార్పొరేటర్ గోకరి శ్రీలతాసురేశ్‌గౌడ్ అన్నారు. ఆనంద్‌నగర్‌కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికుల ఫిర్యాదు మేరకు గురువారం మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులున్నా తనను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీవాసులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతో ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు యూనిఫాంలు అందజేస్తున్న కార్పొరేటర్ పద్మావతిపాపయ్యయాదవ్

బండ్లగూడ: విద్యతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ ఏడో డివిజన్ కార్పొరేటర్ పద్మావతిపాపయ్యయాదవ్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు యూనిఫాం, నోటుబుక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువును నిర్లక్ష్యం చేయకుండా ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా వినాలన్నారు. కార్యక్రమంలో చంద్రకళ, జయలక్ష్మి, సావిత్రి, రాజుయాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించండి



డీఎంకు వినతిపత్రం ఇస్తున్న వట్టినాగులపల్లి గ్రామస్తులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు హెచ్‌సీయూ డిపో మేనేజర్ మురళిరెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు కె.శేఖర్, ఎస్.మల్లేశ్ ముదిరాజ్ మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని, ఐటీ జోన్‌కు సమీపంలోనే తమ గ్రామం ఉందని అయినప్పటికీ బస్ సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయమై డీఎం సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బి. అరుణ్‌కుమార్, ఎం. సాయిరాం, కె. సాయియాదవ్, బి.సాయి తివారీ తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నకు సత్కారం



ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను సన్మానిస్తున్న దయానంద్

రాజేంద్రనగర్: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ కోరని దయానంద్ (డేవిడ్) గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సత్కరించారు.

మణికొండ: ఎమ్మెల్సీగా గెలుపొందిన తీన్మార్ మల్లన్నను రాజేంద్రనగర్ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు డి. ప్రణయ్ గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రణయ్ మాట్లాడుతూ పట్టభద్రులకు ఉద్యోగావకాశాలు కల్పించేలా కృషి చేయాలని కోరారు.

నేడు అక్షరాభ్యాస కార్యక్రమం

శంషాబాద్: పట్టణంలోని హుడా కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 14న (నేడు) ఉదయం అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

16 న ఇనార్బిట్ మాల్‌లో ఫాదర్స్ డే

సాక్షి, సిటీబ్యూరో: మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్‌లో ఈ ఏడాది కూడా ఫాదర్స్ డే వేడుకలను నిర్వహించనున్నట్లు మాల్ ప్రతినిధులు తెలిపారు. జూన్ 16వ తేదీన జరిగే ఫాదర్స్‌డే కోసం మాల్‌లో ప్రత్యేకమైన థీమ్ అలంకరణలు, ఫొటోబూత్‌లు సిద్ధం చేశామని, తండ్రుల కోసం ప్రత్యేకంగా ఎక్స్‌పీరియన్స్ జోన్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. తండ్రులకు అద్భుతమైన బహుమతులతో పాటు మరచిపోలేని అందమైన జ్ఞాపకాలను అందించేలా అన్ని సిద్ధం చేశామన్నారు. షాప్ అండ్ విన్ థ్రిల్ పేరిట ప్రత్యేక బ్రాండ్స్ దుస్తుల ప్రదర్శన కూడా ఉంటుందన్నారు.

రెగ్యులర్ డాక్టర్లను నియమించాలి

సుల్తాన్‌బజార్: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న బస్తీ దవాఖానాల్లో రెగ్యులర్ డాక్టర్లు, నర్సులను నియమించి ప్రజలు వర్షాకాలంలో అంటువ్యాధులు, విష జ్వరాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ తెలంగాణ కార్యాలయంలో పీఓడబ్ల్యూ, పీడీఎస్‌యూ, ఐఎఫ్‌టీయూ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు జి.ఝాన్సీ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పి.మహేశ్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అరుణ మాట్లాడుతూ.. బస్తీ దవాఖానల్లో పనిచేసే డాక్టర్లకు 3 నుండి 4 ఆసుపత్రుల్లో బాధితులు ఉండడం వల్ల వారు రోజుకొక హాస్పిటల్‌కు హాజరవుతున్నారన్నారు. కొన్ని ఆసుపత్రుల్లో అసలు డాక్టర్లే లేక రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.